# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :275 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 10-01-2025 | పేజీలు:4 వెల: 2.00


### ఏసీబి వలలో మైనార్టీ స్కూల్ హెచ్ఎం

ఇల్లందు : ఖమ్మం జిల్లా ఇల్లందు మైనార్టీ పాఠశాలలో ఏసీబీ దాడి చేసి లంచం డిమాండ్ చేసిన ప్రధానోపాధ్యాయుడు భీమనపల్లి కృష్ణను పట్టుకున్నారు. జీతం బిల్లు జారీ చేయడానికి రెండు వేల రూపాయలు డిమాండ్ చేశారు. దీంతో ఆ టీచర్ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు ప్రణాళిక ప్రకారం దాడి చేసి హెచ్ఎం భీనపల్లి కృష్ణను పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. పట్టుబడిందిలా. ఇల్లందు మైనార్టీ పాఠశాలలో ఒక టీచర్ జీతం చేయడానికి పది వేల రూపాయలను ప్రధానోపాధ్యాయుడు భీనపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. అయితే అంతా ఇచ్చుకోలేను రెండు వేల రూపాయలు ఇస్తానని హెచ్ఎంను ఒప్పించారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ వేసిన ప్రణాళిక ప్రకారం హెచ్ఎం కృష్ణకు గురువారం ఉదయం ఎనిమిది గంటలకు రూ.రెండు వేలు ఇవ్వగా, ఆ డబ్బులు అటెంబర్ కిచ్చెల్లి రామకృష్ణకు ఇవ్వాలని చెప్పడంతో అలానే డబ్బులు ఇచ్చారు. ఇంతలో ఏసీబీ అధికారులు దాడి చేశారు. హెచ్ఎం అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో ఆయన్ని అదుపులోకి తీసుకుని, ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ రికార్డులు పరిశీలిస్తున్నారు.

## తిరుపతి ఘటనలో మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ఏపీ ప్రభుత్వం..



తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానంలో తొక్కిసలాట చోటుచేసుకొని ఆరుగురు భక్తులు మృతిచెందిన విషయం తెలిసిందే. తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద బుధవారం రాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. తిరుపతిలో ఎనిమిది కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, టికెట్ల కోసం భక్తులు పెద్దెత్తున కేంద్రాల వద్దకు వచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మరణించారు. అయితే, ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా ప్రకటించింది.

మృతిచెందిన భక్తుల వివరాలు..

తిరుమలలో తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన వారిలో విశాఖపట్టణంకు చెందిన రజనీ (47), శాంతి (34), లావణ్య (40), నర్సీపట్నంకు చెందిన నాయుడు బాబు (51), కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన నిర్మల (50), తమిళనాడు సేలం ప్రాంతానికి చెందిన మల్లిగ (49) ఉన్నారు. మరో 40మందికిపైగా గాయాలు కావడంతో వారు ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయితే, మృతుల కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ. 25లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే తిరుపతి వెళ్లి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, వారి పరామర్శించి భరోసా కల్పించాలని మంత్రులు అనగాని సత్య ప్రసాద్, అనిత, సత్యకుమార్ లను ఆదేశించారు. దీంతో గురువారం ఉదయం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డితో కలిసి తిరుపతి రుయా ఆస్పత్రిలో మృతుల కటుంబ సభ్యులను మంత్రులు పరామర్శించారు. స్విమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించి వైద్యులతో మాట్లాడారు.

బాధ్యులపై కఠిన చర్యలు..

అనంతరం మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి మొదలయ్యే సమయంలోనే ఈ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. ఘటనకు కారణంపై విచారణ జరుగుతుందని చెప్పారు. బాధ్యులు ఏ స్థాయిలో ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే, మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ. 25లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. ఇదిలాఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరికొద్ది సేపట్లో తిరుపతికి వెళ్లనున్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటనలో గాయపడి స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని చంద్రబాబు పరామర్శిస్తారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీయనున్నారు. అనంతరం ఘటనకు కారణం ఏమిటి.. ఎవరి తప్పిదం వల్ల ఇలా జరిగింది అనే విషయాలపై అధికారుల నుంచి చంద్రబాబు వివరాలు తెలుసుకోనున్నారు. అదేవిధంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా సాయంత్రం తిరుపతి వెళ్లనున్నారు. ఘటనలో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందున్న వారిని ఆయన పరామర్శిస్తారు.

## సంక్షేమం ఆగదు.. విపక్షాలకు డిప్యూటీ సీఎం భట్టి చురకలు



వనపర్తి : ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా సంక్షేమ పథకాల అమలు మాత్రం ఆగదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ ఉప కేంద్రాల శంకుస్థాపన, ప్రారంభోత్సవానికి రేవల్లి మండలం తల్పునూర్ గ్రామానికి చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. అలాగే గోపాల్ పేట మండలం ఏదుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11కేవి విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసి తీరుతామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా పాత పథకాలకు కోత విధించడం లేదన్నారు. రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తామని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన గ్యారంటీలను ప్రజా ప్రభుత్వం అమలు చేయదంటూ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వాటిని ఎవరూ నమ్మవద్దన్నారు. ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి వెంట నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిలున్నారు.

## మానవుడి భవిష్యత్ యుద్ధంలో లేదు..



ఒడిశా: ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాస భారతీయ దినోత్సవ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒడిశాలో అడుగడుగునా వారసత్వమే కనిపిస్తుంది.. ఇక్కడి నుంచి వ్యాపారులు సుమత్రా, బాలి, జావా లాంటి ప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారని తెలిపారు. ప్రజాస్వామ్యానికి కేవలం భారత్ తల్లి లాంటిది మాత్రమే కాదు.. అది మన జీవితాల్లో భాగం అని ఆయన వెల్లడించారు. జీ20 సందర్భంగా భారత్ వైవిధ్యాన్ని ప్రపంచానికి తెలియజేశామని చెప్పారు. మన దగ్గర ఉన్న విభిన్న సంస్కృతులను ప్రపంచ దేశాలు గమనిస్తున్నాయి.. భారతదేశం స్వాతంత్ర్యం సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసుల పాత్ర కూడా ఉందని నరేంద్ర మోడీ తెలిపారు. అయితే, ప్రవాస భారతీయులు వచ్చే ఏడాది ఈ ఉత్సవానికి వచ్చేటప్పుడు ఐదుగురు విదేశీ మిత్రులను తమతో పాటు తీసుకు రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచించారు. భారత్ కేవలం యువ దేశమే కాదు.. నిపుణులైన యువకుల దేశం కూడా అని చెప్పుకొచ్చారు. భారత్‌కు ‘విశ్వబంధు’గా పేరుంది..

దానిని మరింత బలోపేతం చేస్తామన్నారు. మహాకుంభ్, సంక్రాంతి, లోహిర్, మాగ్ బిహు లాంటి పండుగల సీజన్‌లో ప్రవాస భారతీయ వేడుకలు జరపడం విశేషం అన్నారు. ఈ సందర్భంగా ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షుడు క్రిస్టీనే కార్ల వీడియోలో పంపిన సందేశంలో భారత్ యొక్క పురోగతి గురించి వెల్లడించారు. కాగా, రష్యా, ఇజ్రాయెల్ పేర్లను నేరుగా ప్రస్తావించకుండా భవిష్యత్తు యుద్ధంలో కాదని.. బుద్ధుడిలో ఉందని నరేంద్ర మోడీ తెలిపారు. అశోకుడు ఖడ్గంతో సామ్రాజ్య విస్తరణకు ఛాన్స్ ఉన్నా.. బౌద్ధం స్వీకరించారని ఆయన గుర్తు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మోడీ ప్రవాసి భారతీయ ఎక్స్‌ప్రెస్’ రైలును భువనేశ్వర్‌లో జెండా ఊపి ఆరంభించారు. ఈ కార్యక్రమంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## దిల్ రాజు సినిమా తిరస్కరించాలి..



హైదరాబాద్: తెలంగాణ ప్రజల సంస్కృతిని అవమానించేలా మాట్లాడిన దిల్ రాజు సినిమా తిరస్కరించాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌తో కలిసి రసమయి బాలకిషన్ మీడియాతో మాట్లాడారు. నేను నిజాయితీగా, మాట మీద నిలబడుతాన’ని పొంకనాలు పలికిన రేవంత్ రెడ్డి.. రాత్రికి రాత్రి గేమ్ ఛేంజర్ సినిమాకు బెనిఫిట్ షోలు, అద’పు షోలకు జీవో జారీ చేశారు. ఒప్పందం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. వీళ్లేమ’న్న దేశభక్తులా..? దేశ రక్షణకు పాటు పడుతున్నారా..? అదనపు, బెనిఫిట్ షోలు ఎందుకు అని రేవంత్ రెడ్డి మొన్నటికి మొన్నలు మాట్లాడారు. ఇవాళ దిల్ రాజుకు రేవంత్ రెడ్డి ఎంత’కు అమ్ముడు పోయారు..? కేవలం నాలుగు షోలు ఉంటాయి. కానీ తెల్లవారుజామున నాలుగు గంటలకేచి పోయి గేమ్ ఛేంజర్ చూడాల్నట. మరి గేమ్ ఛేంజర్‌కు నిన్ను ఏం గేమ్ ఛేంజర్ చేశాడో చెప్పాలి అని సీఎం రేవంత్ రెడ్డిని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యామంలో దిల్ రాజు లేడు. దిల్ రాజు దిల్ ఎప్పుడు ఆంధ్రా వైపే. ఉద్యమ సమయంలో చెప్పాం.. ఇవాళ కూడా అదే చెబుతున్నాం. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఆడియో ఫంక్షన్‌లో మాట్లాడిన మాటలను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదు. మటన్ ముక్కకు, కల్లును మాత్రమే ఆరాధిస్తారు.. సినిమాలను ఆరాధించరు అని దిల్ రాజు మాట్లాడాడు. ఇంత అవమాకరమైన మాటలు మాట్లాడిన దిల్ రాజు సినిమా తెలంగాణ ప్రజలు తిరస్కరించాలి. తెలంగాణ సంస్కృతిని అవమానించారు. తెలంగాణాలో బతుకైనా, చావైనా, పండుగైనా కల్లు ఉంటోంది.. మటన్, చికెన్ ఉంటది. నువ్వు తీసిన బలగం సినిమాలో కూడా ఆత్మ శాంతించాలని కల్లు పెట్టి, మటన్ పెట్టి చూపించావ్. న’ల్లి బొక్క మీద, కల్లు మీద, ప్రజ’ల సంస్కృతి మీద ఆప్యా’త’ల మీద నీవు తీసిన సినిమాను ఆదుకున్నారు. నీవు ఆదరణను, కృతజ్ఞతను మరిచిపోయావు. బలగం సినిమా గొప్పగా ఆదరించారు. కానీ ఇవాళ నీవు వారినే అవమానిస్తున్నావ్. కేవలం నీ సినిమాల కోసం ఆంధ్రా వ్యక్తులను పొగుడుతూ మాట్లాడడం సరికాదు. సీఎం ఎంత’కు అమ్ముడు పోయాడు. మీ బెనిఫిట్ కోసమే బెనిఫిట్, అదనపు షోలను ప్రదర్శిస్తున్నారా..? అని ప్రజలు అడుగుతున్నారు. ప్రశ్నించే వ్యక్తులపై కేసులు పెడుతున్నవ్.. ఆరు గ్యారెంటీలను మరిచిపోయావు. తెలంగాణను సీఎం రేవంత్ రెడ్డి ఆగం చేస్తున్నారు. అదనపు షోలకు అనుతి ఇచ్చేది లేదని సినిమాటోగ్రఫీ మంత్రి మాట్లాడిండు. ఆయన కూడా ఒప్పందం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది అని రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు.

## మృతుల సంఖ్యపై క్లారిటీ ఇచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి..



తిరుపతి:ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకరమన్నారు. మృతుల సంఖ్యపై క్లారిటీ ఇచ్చారు.“చిన్న చిన్న దెబ్బలు తగిలిన అందరూ కోలుకుంటున్నారు.. ఒక వ్యక్తి కి ఫ్యాక్చర్ గాయాలు ఉన్నాయి.. తొక్కిసలాట లో ఐదుగురు చనిపోయారు.. క్యూ లైన్ లో అస్వస్థత కు గురై ఒకరు చనిపోయారు.. మృతి చెందిన ఆరుగురు మినహా , తీవ్ర గాయాలు ఎవరికి లేవు.. స్విమ్స్ లో 29 మంది కి ఇప్పటికీ చికిత్స అందిస్తున్నారు.. జరిగిన ఘటన వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉన్నా కఠిన చర్యలు ఉంటాయి..” అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు పద్మావతి వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్నారు. వారిని ఈవో శ్యామలరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. 41 మందికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తేలినట్లు చెప్పారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.“ప్రాథమిక చికిత్స అనంతరం కొందరిని వైద్యులు డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి చికిత్స జరుగుతోంది.” అని వెల్లడించారు. ఇదిలా ఉండగా..మంత్రులు అనిత.. ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ రుయా ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులను కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు వారికి వివరించారు. బాధితులను మంత్రులు పరామర్శించారు. కుటుంబీకులను కోల్పోయిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## తొక్కిసలాట ఘటనలో మరణాలు.. ప్రభుత్వం చేసిన హత్యలే



అమరావతి : తిరుపతి (తిరుపతి) తొక్కిసలాట ఘటనపై మాజీ మంత్రి రోజా (మాజీ మంత్రి రోజా) కూటమి ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంవల్లే ఆరుగురు చనిపోయారని, ఇవి ప్రభుత్వం చేసిన హత్యలేనని. ముఖ్యమంత్రి, మంత్రులు, పాలకమండలి తమ పదవులకు రాజీనామా చేయడం, వారిపై క్రిమినల్ కేసులు (క్రిమినల్ కేసులు) నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం తాతపల్లి వైసీపీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైకుంఠ ద్వారా దర్శనం సమయంలో ఇలాంటి దురదృష్ట ఘటనలు జరిగిన దాఖలాలు లేవని అన్నారు. చంద్రబాబు టీటీడీ చైర్మన్‌గా అసమర్థుడిని పెట్టారని. లక్షలాధి మంది వచ్చే దేవస్థానంలో భద్రతపై చిత్తశుద్ధిలేని వ్యక్తిని ఎస్పీగా పెట్టారని. వీరంతా చంద్రబాబు ఊడిగం చేసేందుకే పనిచేస్తున్నారని. చంద్రబాబు (చంద్రబాబు) అధికారంలోకి వచ్చినప్పుడల్లా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలుస్తోంది. గోదావరి పుష్కరాల సమయంలో జరిగిన తొక్కిసలాట 29 మంది చనిపోయారని, ఇటీవల విజయవాడలో వరదలు 60 మంది చనిపోయారని.

సనాతన యోధుడు స్పందించాలి

. పాలనలో నిర్లక్ష్యం జరిగినందున అంద కూటమి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో పుష్ప సినిమా బెనిఫిట్ షోలో తొక్కిసలాట జరిగితే హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లుగానే తిరుపతి ఘటనపై చంద్రబాబు , టీటీడీ పాలక మండలి, అధికారులను బాధ్యులు చేస్తూ క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పీఠాధిపతులు సైతం స్పందించి పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఎండగట్టాలని వివరించారు. బీజేపీ నాయకులకు నిజంగా భక్తి మీద శ్రద్ధ ఉంటే తిరుపతి ఘటనపై మోదీకి ఫిర్యాదు చేసి, విచారణకు ప్రధాని ఆదేశించాలని కోరారు. గత వైసీపీ హయాంలో ఏనాడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం. క్యూలైన్‌లో భక్తులకుపాలు, వృద్ధులకు కలెక్టర్లు కల్పించామని చెప్పారు.

### తొక్కిసలాట దురదృష్టకరం.. భూమన

తిరుపతి : తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీలో తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతిచెందడం దురదృష్టకరమని మాజీ టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టోకెన్లు జారీలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను మాజీ టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరిశీలించారు. పద్మావతి పార్క్ ఏరియా, ఎంజీఎం హైస్కూల్ వద్ద క్యూలైన్లు, కౌంటర్లను భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టోకెన్ల జారీ కేంద్రాల వద్ద బుధవారం రాత్రి జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. క్యూలైన్లలో ఉన్న భక్తులతో మాట్లాడుతూ జాగ్రత్తలు సూచిస్తూ నెమ్మదిగా వెళ్లి టిక్కెట్లు తీసుకోవాలని భూమన, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచించారు.

## ఢిల్లీ ఒక్కస్థానం నుంచే పోటీ చేస్తున్నా..



న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. అధికార, విపక్ష పార్టీల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుంటాయి. ఈ కారణంగా ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీఢ్మ మాజీ సీఎం, ఆమ్ ఆమ్ ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ (అరవింద్ కేజ్రీవాల్) రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ మరో నేతలు ఉన్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ (పర్వేష్ వర్మ), కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ కోరుతోంది. 70 మంది సభ్యులు ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుంది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు వచ్చాయి.

### డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానంటూ భారీ మోసం

హైదరాబాద్ : డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు(డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు) ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పి ఓ దుండగుడు పేదల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి ముఖం చాటేశాడు. వివరాల్లోకి వెళ్తే..గచ్చిబౌలి (గచ్చిబౌలి)టీఎన్జీవోస్ కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి శేరిలింగంపల్లి ఎమ్మార్వో ఆఫీస్‌లో పని చేస్తున్నాను, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పిస్తానని 22 మంది వద్ద డబ్బులు వసూలు చేశారు. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.50 వేలు చొప్పున వసూలు చేశాడు

## సంపాదకీయం

**శుక్రవారం 10-01-2025**

# డిటెన్షన్ ఎవరి వైఫల్యం..?


భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పదేండ్ల కాలంలో అంటే 1960 కల్లా 6 నుంచి 14 ఏండ్ల మధ్య వయసు గల పిల్లలకుఎలిమెంటరీ స్థాయి వరకు ఉచిత నిర్బంధ విద్యా విధానం అందించాలనేది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని ఆర్టికల్ 45 లక్ష్యం. ఇది నెరవేరలేదు కాబట్టి 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 21(ఏ)ను చేర్చారు. దీని ప్రకారం విద్యా హక్కు జీవించే హక్కులో భాగమైంది.దీనికి అనుగుణంగా విద్యాహక్కు చట్టాన్ని రూపొందించారు. 2010 నుంచి ఇది అమలవుతూ వస్తున్నది.పిల్లలందరికీ 14 ఏండ్ల వయసు (8వ తరగతి) వరకు విద్య తప్పకుండా అందాలంటే ఆ స్థాయి వరకు పిల్లల విద్య ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగాలి. కాబట్టి 8వ తరగతి వరకు ఎలాంటి బోర్డు పరీక్షలు ఉండకూడదని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యారన్న కారణంగా పై తరగతులకు పంపకుండా ఉండరాదని, అంటే డిటైన్ చేయకూడదని విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 నిర్దేశిస్తుంది. దీని అర్థం పిల్లలకు పరీక్షలు ఉండకూడదని కాదు. పిల్లల్ని టీచర్లు ఎప్పటికప్పుడు నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలి. తగిన దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. అవి పిల్లలకు భారం కాకుండా ఉండాలి, ఆ స్ఫూర్తితోనే నిరంతర సమగ్ర మూల్యాంక పద్ధతిని (సీసీఈ) ప్రవేశపెట్టారు.ఆ తర్వాత ఈసీసీఈ, నో డిటెన్షన్ విధానాలు అమలు జరుగుతున్న తీరుపై సమీక్ష కోసం అప్పటి కేంద్ర ప్రభుత్వం 2012లో హర్యానా విద్యామంత్రి గీతా బుక్కల్ అధ్యక్షతన సీఏబీఈ కమిటీని నియమించింది. ఈ కమిటీ సీసీఈని సరిగా అమలు చేయడానికి టీచర్లను సంసిద్ధం చేయాలని, ఉపాధ్యాయ విద్యను సంస్కరించాలని.. 5,8 తరగతుల వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు నిర్వహించి మళ్లీ పరీక్ష పెట్టి పై తరగతులకు పంపించాలని సిఫారసు చేసింది. కానీ ప్రథమ్ వారి ఏఎస్ఈఆర్ సర్వే ఫలితాలు వెలువడిన ప్రతిసారీ పిల్లలు సరైన సామర్థ్యాలు పొందడం లేదనే చర్చ విస్తృతమైంది. ఈసీసీఈ విధానం, నో డిటెన్షన్ విధానాల వల్లే ఈ సమస్య పెరిగిందనే చర్చలు జరిగాయి. 2017లో జరిపిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే ఫలితాలు కూడా పిల్లలకు స్థాయీ సంబంధిత సామర్థ్యాలు లేవని తేల్చింది. దీంతో నో డిటెన్షన్, సీసీఈ విధానాల వల్ల పిల్లలు వార్షిక పరీక్ష పరీక్షల్లో ఫెయిలైనా పై తరగతులకు వెళ్తున్నారని, దీని వల్ల చదువుపై వారిలో శ్రద్ధ లోపించిందని, టీచర్లకు జవాబుదారీతనం లేకుండా పోయిందనే వాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో 2019లో విద్యాహక్కు చట్టానికి సవరణ చేసి 5,8 తరగతుల వార్షిక పరీక్ష ఫలితాల ఆధారంగా డిటెన్షన్ విధానాన్ని అమలు చేసే వెసులుబాటు కల్పించారు. అయితే, ఈ డిటెన్షన్ విధానం అమలు చేయడంలో రాష్ట్రాలకు స్వేచ్ఛను ఇచ్చారు. దీంతో ఈ విధానాన్ని కొన్ని రాష్ట్రాలు అప్పటి నుంచి అమలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాలు మాత్రం ఈ విధానాన్ని అమలు చేయడం లేదు.ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అధీనంలో నడిచే కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. దీంతో ఈ విషయంపై మరోసారి చర్చ తెరపైకి వచ్చింది. ఈ సందర్భంగా పిల్లలు తమ స్థాయికి తగ్గ విషయాలను ఎందుకు నేర్చుకోలేక పోతున్నారన్నది గమనార్హం. దీనికి సరైన కారణాలను, పరిష్కారాలను వెతకాలి. ఈ అన్వేషణ కనుక సరైన రీతిలో జరిగితే డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడమా, నో చెప్పడమా? అనేవి అంతగా ముఖ్య విషయాలు కావన్న విషయం తెలుస్తుంది.మూడు దశాబ్దాలుగా ఉపాధ్యాయ విద్యలో జరిగిన ప్రైవేటీకరణ కారణంగా లాభార్జన లక్ష్యంతో నడిచే ప్రైవేటు ఉపాధ్యాయ విద్యాసంస్థలు ఎక్కువయ్యాయి. ఇవి సర్టిఫికెట్లను అమ్ముకునే షాపులుగా మారాయని స్వయానా జాతీయ విద్యా విధానం 2020 ముసాయిదా కూడా పేర్కొన్నది. ఇలాంటి సంస్థల నుంచి ఉత్పన్నమైన టీచర్లు సమగ్ర నిరంతర మూల్యాంకనం స్ఫూర్తిని అర్థం చేసుకుంటారని ఆశించలేం. టీచర్ల పని పరిస్థితులను మెరుగుపరచడం, కరికులం లోడ్ లేకుండా చూడటం, శాస్త్రీయమైన వర్క్‌లోడ్ ఉండేటట్టు చూడటం, స్కూళ్ల పని గంటలను హేతుబద్ధీకరించడంలో ఇంకా వలసవాద వికారం (కలోనియల్ హేంగోవర్) కనబడుతూనే ఉంటుంది.నేషనల్ కరికులం ఫ్రేమ్ వర్క్ 2005 సిఫారసులను అనుసరించి స్కూల్ కరికులంలో చాలా శాస్త్రీయ మార్పులు జరిగాయి. కానీ టీచర్ల వర్క్ లోడ్ విషయంలో ఇంకా కలోనియలిజం ఛాయలను విస్మరించలేక పోతు న్నాం. ఎక్కువ బోధనా గంటలు ఎక్కువ విషయాలను నేర్పుతాయనే భావనలోనే ఉన్నాం. పని పరిస్థితులను మెరుగుపరిచే భౌతిక వసతుల విషయంలో మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. ఈ మౌలిక విషయాలను విస్మరించిన విద్యా తాత్వికతనే మన బ్యూరోక్రాట్స్ విశ్వసిస్తారు. వారి విశ్వాసాలకు అనుగుణంగానే విద్యావిధానాలు రూపొందుతాయి. విద్యా విధానాల రూపకల్పన నుంచి విద్యావేత్తలు దూరమై చాలా కాలమే అయింది. అందుకనే పరీక్ష లు, వాటి ఫలితాలు, డిటెన్షన్ విధానాలు ప్రాధాన్యం పొందుతూ ఉన్నాయి.పిల్లలు ఫెయిల్ అవడం అంటూ ఉండదు, వాళ్లు ఫెయిల్ చేయబడుతారు అని ఎన్సీఈఆర్టీ మాజీ ప్రొఫెసర్ కృష్ణకుమార్ ఒక సందర్భంలో అన్న మాటలను గుర్తుకు తెచ్చుకోవలసిన సందర్భం మరోసారి వచ్చింది. పిల్లలకు సంబంధం లేని విషయాల వైఫ్యల్యాన్ని వారి వైఫల్యంగా చూపించే ప్రయత్నం అన్యాయం, జీవించే హక్కులో భాగంగా గుర్తించబడిన విద్యా హక్కు సాధనలో అది అనాగరికం కూడా.

# డాలర్ పైపైకి...



న్యూఢిల్లీ,భారత బడా బూర్జువా వర్గం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశ సహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలి వేశా రు. దాని ఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్‌కి 85.7 రూపాయిలుగా ఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒక డాలర్‌తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది.1948 నుండి 1980 వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది.అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79 సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్న వ్యత్యాసం, పెద్ద నోట్ల రద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ -రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది.ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వ స్థానంలో ఉన్న భారత్‌కు 85% చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహారధాన్యాలు, పప్పులు, లోహాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి.ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిల్ ధరలు పెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి.అంతేకాకుండా ప్రయాణ ఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టివిలు, ల్యాప్ టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతి చేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏ దేశ పెత్తనం ఉంటుందో, ఆ దేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది.డాలర్ ఆధిపత్యం: చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆ దేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974 లో సౌదీ అరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీ అరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వ బాండ్లలో మదుపు చేయాలని, దానికి బదులుగా సైనిక, ఆర్థిక సహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా సౌదీ అరేబియాను తన వ్యూహంలో అమెరికా ఇరికించింది. అప్పటి నుండి చమురు ఉత్పత్తి దేశాల్లో డాలర్లలోనే చమురు విక్రయం కొనసాగింది. ముడి చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగా పెరిగింది. ముడి చమురుకు అన్ని దేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది.అంతర్జాతీయ మార్కెట్లో వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది. డాలర్ గిరాకీ వల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దాని విలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరం కాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధం వలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురు తిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తే వాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతం ఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ మారకంలో ఆయా దేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీ రుణాలపై అసలు, వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగా మారుతుంది. ఆయా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది.అందువల్ల అమెరికా తనకు నచ్చిన దేశానికి కావాల్సినంతమేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింపచేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనం అమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకు ఆయా దేశాలు చేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆ దేశాల దగ్గర ఉన్న డాలర్ నిల్వలు తరిగిపోతాయి. ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవి డాలర్ ప్రమేయం లేని వ్యాపారం ద్వారా పొందవచ్చు కాని ఇప్పటికే ఆ దేశాలు ఐఎంఎఫ్ లేదా ప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సిన ఉంది.అప్పుడు డాలర్ల అవసరం ఆ దేశాలకు తప్పదు. ఆ విధంగా ఐఎంఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధారపడటం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభం చేస్తుంది. అది అమెరికాకు ఇష్టం ఉండదు.బ్రిక్స్ ఏర్పాటు: వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా, భారత్, దక్షిణాఫ్రికా దేశాలు బ్రిక్స్ దేశాల కూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచన చేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేక ఆర్థిక వ్యవస్థ దీని ఏర్పాటు లక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయా దేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండ్ ను బ్రిక్స్ ముందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకు పైగా ఉంది. ఇది ప్రపంచ జనాభాలో 41%, ప్రపంచ వ్యవసాయంలో 45% కలిగి ఉన్నాయి. బ్రిక్స్ దేశాలు, తమ ద్వైపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించుకుంటాయి.అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధి బ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధమవుతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి. డాలర్ ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కి ప్రత్యామ్నాయంగా ఆ దేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి. బ్రిక్స్ వేదికగా సమర శంఖం పూరించాయి. పెట్రోల్ విక్రయంలో డాలర్‌కు సౌదీ అరేబియా స్వస్తి చెప్పటం బ్రిక్స్‌కి బలం చేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతో పాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఇయు)యూరో, జపానీస్ యెన్ ల లోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు కలిసి ఉమ్మడి కరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి. ఆ కరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయ రావాల్సి ఉంది.డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వాణిజ్యం జరగాలన్న అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, అలా వ్యతిరేకిస్తున్న దేశాలను బెదిరించటానికి ట్రంప్ పూనుకున్నాడు. అమెరికాకు ఆ దేశాలు ఎగుమతి చేసే సరుకులపై 100% సుంకాన్ని విధిస్తామనే బెదిరింపులు చేస్తున్నాడు. ట్రంప్ బెదిరించగానే ప్రపంచంలో మూడవ అతిపెద్ద 'ఆర్థిక' వ్యవస్థగా చెప్పుకుంటున్న భారతదేశం డాలర్ రహిత వాణిజ్యం పట్ల ఆసక్తిలేదని ప్రకటించటం అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ లొంగుబాటును వెల్లడి చేస్తున్నది. భారత రూపాయి విలువ పతనానికి అధికార మార్పిడి జరిగిన దగ్గర నుంచి నేటి వరకు పాలక ప్రభుత్వాలు అనుసరించిన, అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో, డాలర్ ఆధిపత్యాన్ని వ్యతిరేకించకపోవటం, దేశం స్వయం సమృద్ధిని సాధించే విధానాలు అనుసరించకపోవటం, పెద్ద ఎత్తున చేసిన విదేశీ అప్పులకు డాలర్ల రూపంలో చెల్లించటమే కారణం. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించటం ద్వారానే రూపాయి పతనం ఆగుతుంది.

# తిరుమలలో పూర్తికావచ్చిన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు




తిరుమల, తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఇలవైకుంఠం తిరుమలలో ఏటా వైకుంఠ ఏకాదశికి భారీగా భక్తులు తరలివస్తారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 రోజులపాటు వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచుతామని, అందుకు తగిన భద్రతా చర్యలు చేపట్టామని టిటిడి ఈఓ శ్యామలా రావు ప్రకటించారు. మహాకుంభమేళలో టిటిడి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. జనవరి 13 నుండి ఫిబ్రవరి 26 వరకు జరగనుందని తెలిపారు. 2.89 ఎకరాల భూమి కుంభమేళా లో కేటాయించారని, అక్కడ నమూనా ఆలయాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. శ్రీవారి ఆలయంలో జరిగే అన్నీ సేవలు, కైంకర్యాలు నమూనా ఆలయంలో నిర్వహిస్తామన్నారు. జనవరి 18, 26.. ఫిబ్రవరి 3, 26 తేదిలలో కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. తిరుమల నుండి కుంభమేళాకి కళ్యాణ రథం ప్రారంభించారు. ఇకపోతే వైకుంఠ ద్వార దర్శన టికెట్లు ఉన్న వారికే పది రోజుల పాటు దర్శనం, టికెట్లు లేకుంటే దర్శనం లేదు అని స్పష్టం చేశారు. పది రోజుల్లో 7 లక్షలమంది దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 9 న సర్వదర్శన టికెట్లు జారీ నిలిపివేస్తున్నామని తెలిపారు. సిఫార్సు లేఖలు రద్దు చేశామన్నారు. వసతి ఎవరు ముందు వస్తే వారికే కేటాయిస్తామని చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామన్నారు. జనవరి 10న ఉదయం 4:30 గంటలకు విఐపీ దర్శనం ఉందన్నారు. 8:30 గంటలకు సామాన్య భక్తులు దర్శనం ఉంటుందన్నారు. ఏకాదశి నాడు స్వర్ణ రథం ఊరేగింపు ఉంటుందన్నారు. 12 గంటలకు వాహన మండపంలో భక్తులు కోసం ఉత్సవమూర్తు లుంటారని తెలిపారు. ద్వాదశి నాడు శ్రీవారి పుష్కరిణి లో చక్రస్నానం ఉంటుందన్నారు. 9వ తేది ఉదయం 5 గంటలకు తిరుమల తిరుపతి లో 94 కౌంటర్ లో టోకెన్ లు కేటాయిస్తున్నామన్నారు. 10, 11, 12 తేదిలకు 9 తేది కేటాయింపులున్నాయన్నారు. తక్కిన రోజుల్లో ఏరోజుకారోజు మూడు ప్రదేశాలలో టోకెన్ కేటాయిస్తామన్నారు. ఇప్పటికే ఆన్ లైన్ వైకుంఠ ద్వార దర్శన టికెట్లు కేటాయించామన్నారు. ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామన్నారు. 12 వేల వాహనాలకు వాహన పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విఐపీలకు రాంభకిఛ వద్దే వాహనాలు అనుమతిస్తామన్నారు. భద్రత పై ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. టోకెన్ ఇచ్చే కేంద్రాల వద్ద విజిలెన్స్, పోలీసుల సహాయంతో ఏర్పాట్లు చేశామన్నారు. అన్న ప్రసాద కేంద్రం ఉదయం ఆరు గంటల నుండి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఆలయంలో అలంకరణ ప్రత్యేక నిపుణులతో చేయిస్తున్నామన్నారు. మూడువేల శ్రీవారి సేవకుల సేవలు వాడుకుంటామని తెలిపారు. పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వైకుంఠ ఏకాదశికి విఐపీల తాకిడి అధికంగా ఉన్న సందర్భంగా ప్రత్యేక భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులకు టికెట్ పైనే రూట్ మ్యాప్ ఏర్పాటు చేశామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా తిరుమలలో రూట్ మ్యాప్ తెలుసుకోవచ్చునని చెప్పారు. మూడు వేలమందితో వైకుంఠ ఏకాదశి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

### కింగ్‌ఫిషర్ బీర్ ప్రియులకు చేదువార్త

హైదరాబాద్,ఇది బీర్ ప్రియులకు పెద్ద షాక్.. ముఖ్యంగా కింగ్ ఫిసర్ బీర్‌ప్రేమికులకు మింగుడు పడదు. తెలంగాణకు కింగ్ ఫిషర్ల బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రూవరీస్ కంపెనీ స్పష్టం చేసింది. తెలంగాణ స్టేట్ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ బకాయిలు చెల్లించకపోవడంతో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూబీఎల్ ప్రకటించింది. తెలంగాణ ప్రభుత్వం బీర్ల ధరలను పెంచింది కానీ.. తయారీదారులకు చెల్లించే బేస్ ధరను పెంచకపోవడంతో భారీ నష్టాలు వస్తున్నాయని యూబీఎల్ తెలిపింది.

# ఆ యూనివర్సిటీకి కళంకం తేవడం నాకు ఇష్టం లేదు

చెన్నై,అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు. 'సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి కరమైన చర్య' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. 'సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని స్టాలిన్ ఆరోపించారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల 19 ఏళ్ల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

# కేరళ ఉత్సవాల్లో అపశ్రుతి

తిరువనంతపురం, కేరళ రాష్ట్రంలో నిర్వహించిన ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. ఉత్సవాల కోసం తీసుకొచ్చిన ఏనుగుల్లో ఒకటి జనాలపైకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. బుధవారం తెల్లవారుజామున 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మలప్పురంలోని బీపీ అంగడి వద్ద మంగళవారం రాత్రి వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏనుగులను తీసుకొచ్చారు. ఉత్సవాలు జరుగుతుండగా.. ఉన్నట్టుండి ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. పెద్ద పెద్దగా శబ్దాలు చేస్తూ.. జనాల్లోకి దూసుకెళ్లింది. ఓ వ్యక్తిని తొండంతో ఎత్తి పక్కకు పడేసింది. ఈ ఘటనలో సదరు వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడికి కొట్టకల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఏనుగు ఒక్కసారిగా బీభత్సం సృష్టించడంతో జాతరకు వచ్చిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో సుమారు 17 మందికిపైగా గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని ఏనుగును బంధించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.

# ఎవరి వైపు మొగ్గు చూపుతారు..?

హైదరాబాద్,కేటీఆర్ అరెస్ట్ అయితే.. పార్టీని ఎవరు నడిపిస్తారన్న ప్రశ్న వినిపించిన ప్రతీసారి.. చాలాపేర్లు తెరమీదకు వస్తున్నాయ్. ఐతే అందులో ఎవరికి అవకాశం దక్కుతుందన్నదే ఇప్పుడు కనిపిస్తున్న చర్చ.. గులాబీ శ్రేణులు ఏమనుకుంటున్నాయా.. గులాబీ బాస్ రంగంలోకి దిగుతారా.. వింటేజ్ కేసీఆర్‌ను పరిచయం చేస్తారా.. లేదంటే హరీష్, కవితలో ఒకరు బాధ్యత తీసుకుంటారా.. ఇదే ఇప్పుడు వినిపిస్తున్న చర్చ..

పొలిటికల్‌గా యాక్టివ్ అవుతున్నహరీశ్

ఎదురుదెబ్బల నుంచి బలంగా తిరిగివస్తా అంటూ కేటీఆర్ చేసిన ఓ ట్వీట్.. కొత్త చర్చకు కారణం అవుతోంది. అరెస్ట్ ఖాయమని ఆయన డిసైడ్ అయిపోయారని కొందరు అంటుంటే.. రేవంత్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయ్. ఆ ట్వీటే ఇప్పుడు కేటీఆర్ అరెస్ట్ గురించి.. ఆ తర్వాత పార్టీ నాయకత్వం గురించి చర్చకు కారణం అవుతోంది. కేటీఆర్ అరెస్ట్ అయినా.. బీఆర్ఎస్‌కు నాయకత్వ సమస్య లేదు అన్నది కొందరి వాదన. నిర్మాణాత్మకమైన కేడర్ లేకపోయినా.. బలమైన నాయకులు ఉండడం పార్టీకి కలిసొచ్చే అంశం.నాయకత్వ బాధ్యతలు తీసుకునేందుకు హరీష్, కవిత సిద్ధంగా ఉన్నా.. కేసీఆర్ ఎవరి వైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి కనిపిస్తోంది. గ్రౌండ్‌లెవల్‌లో పార్టీ కేడర్‌తో హరీష్‌కు మంచి సంబంధాలు ఉన్నాయ్.. పైగా ఇప్పుడు కవిత కూడా పొలిటికల్‌గా యాక్టివ్ అవుతున్నారు. దీంతో గులాబీ శ్రేణుల్లో కొత్త చర్చ మొదలైంది.

క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవాలంటే..

ఏసీబీ కేసులో ఒకవేళ కేటీఆర్ అరెస్ట్ అయితే.. ఎప్పుడు బెయిల్ దొరుకుతుందో చెప్పలేని పరిస్థితి. ప్రభుత్వ తీరు చూస్తుంటే.. అంత ఈజీగా బెయిల్ దక్కదన్న అనుమానాలు గులాబీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాబోయే రోజులు.. పార్టీకి కీలకం అనే చర్చ జరుగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్కార్ సిద్ధం అవుతోంది. దీంతో రాబోయే రోజుల్లో మరింత అలర్ట్ అవ్వాల్సిన అవసరం ఉంది.కేటీఆర్ అరెస్ట్ అయితే.. ఆ ప్రభావం పార్టీ కేడర్ మీద పడే చాన్స్ ఉంటుంది. వీటిని అధిగమిస్తూ ప్రతిపక్షపార్టీగా.. క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలను దక్కించుకోవాల్సి ఉంటుంది. దీంతో ఇప్పుడు పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో.. పార్టీని ఎవరు నడిపిస్తారన్నది గులాబీ నేతలకు గుబులు పుట్టిస్తున్న పరిస్థితి.

తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు..

ఎమ్మెల్సీ కవిత.. పార్టీ బాధ్యతల్లో మరింత చురుగ్గా మారే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన కవిత.. దాదాపు ఆరు నెలల తర్వాత రిలీజ్ అయ్యారు. విడుదలైనప్పటి నుంచి.. రాజకీయంగా యాక్టివ్ అయేందుకు ఏ అవకాశం దక్కినా.. వదులుకోవడం లేదు. ఓవైపు తెలంగాణ జాగృతి పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూనే%8%. కుల సంఘాల నేతలతో సమావేశం అవుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తూ పార్టీ కేడర్‌కు దగ్గరయ్యే కార్యాచరణ అమలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఖరి ఎండగట్టేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నారు. రెండు, మూడు నెలలుగా రాజకీయాల్లో.. కవిత తన మార్క్ క్రియేట్ చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారా..?

ఇక కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో.. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయ్. ఇక అటు అరెస్ట్ తప్పదన్న అంచనాలతో.. కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసే పనిలో పడ్డారు కేటీఆర్.

# గౌతం అదానీపై అమెరికాలో విచారణ



న్యూఢిల్లీ, బిలియనీర్ గౌతం అదానీ, ఆయన కంపెనీలపై విచారణ చేపట్టేందుకు ఇటీవల అమెరికా సర్కారు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ముడుపులు చెల్లించిన కేసులో అమెరికా కోర్టు అదానీని నిలదీసింది. అయితే భారతీయ వ్యాపారిపై అమెరికా న్యాయశాఖ తీసుకున్న నిర్ణయాన్ని రిపబ్లికన్ నేత తప్పుపట్టారు. ఎంపిక చేసుకుని ఓ వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల.. భాగస్వామ్య దేశాలతో బంధాలు దెబ్బతింటాయని ఆ నేత పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అటార్నీ జనరల్ మెర్రిక్ బీ గార్లాండ్‌కు లేఖ రాశారు లాన్స్ గూడెన్. విదేశీ వ్యక్తులను ఎంచుకుని ఎందుకు టార్గెట్ చేస్తున్నారని న్యాయశాఖను డిమాండ్ చేశారాయన. అదానీ విచారణ వెనుక ఏదైనా లోగుట్టు ఉన్నాదా అని, దీని వెనుక జార్జ్ సోరస్ లాంటి వ్యక్తి ఉన్నారా అని రిపబ్లికన్ నేత ప్రశ్నించారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు బలమైన భాగస్వామిగా ఇండియా ఉన్నదని, టార్గెట్ చేసి చర్యలు తీసుకోవడం వల్ల భాగస్వామ్య కూటమి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దేశంలోని చెడు వ్యక్తులను ముందుగా అమెరికా న్యాయశాఖ శిక్షించాలని, విదేశీ వ్యక్తులను కాదు అని గూడెన్ పేర్కొన్నారు. వందల కోట్ల డాలర్లు పెట్టుబడి పెటి, అమెరికన్ల కోసం లక్షలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నవారిని టార్గెట్ చేయడం వల్ల దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం జరుగుతుందని గూడెన్ తన లేఖలో తెలిపారు. ఒకవేళ అదానీపై ఆరోపణలు నిజమైనా, వాటిని నిరూపించినా, ఆ అంశంలో అమెరికా పాత్ర ఏముంటుందని గూడెన్ ప్రశ్నించారు. అదానీ సంస్థ భారత్‌లో అక్కడి అధికారులకు లంచాలు ఇచ్చిందని, ఓ భారతీయ కంపెనీ ఆ లావాదేవీలకు పాల్పడిందని, దీంట్లో అమెరికా వ్యక్తుల ప్రమేయం ఏమి ఉందని గూడెన్ తన లేఖలో తెలిపారు. అమెరికా వ్యక్తుల ప్రమేయం లేనప్పుడు.. విదేశీ వ్యక్తులను విచారించేందుకు న్యాయశాఖ ఎందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుందని ఆయన అడిగారు. అదానీ ముడుపుల కేసులో ఏ ఒక్క అమెరికా వ్యక్తి లేకపోవడం ఏంటని న్యాయశాఖను ప్రశ్నించారు. ఇండియాలో అవినీతి జరిగితే, అదానీపై అమెరికాలో కేసు ఎందుకు రిజిస్టర్ చేసినట్లు న్యాయశాఖను నిలదీశారు. మీరేమైనా ఇండియాలో న్యాయం కోసం వత్తిడి తెస్తున్నారా అని అడిగారు. ఈ కేసులో నిమగ్నమైన భారతీయ అధికారులను అమెరికాకు రప్పిస్తారా అని ప్రశ్నించారు. ఒకవేళ అవినీతి అధికారుల్ని అప్పగించేందుకు భారత్ నిరాకరిస్తే, అప్పుడు అమెరికా న్యాయశాఖ వద్ద ఉన్న ఆప్షన్ ఏంటని అడిగారు. అమెరికా, భారత్ మధ్య చిచ్చు పెట్టి, బైడెన్ సర్కారు అదానీ కేసును అంతర్జాతీయం చేయాలని చూస్తున్నదా అని రిపబ్లికన్ నేత గూడెన్ ప్రశ్నించారు.

# రమేష్ బిదురిపై బీజేపీ చర్యలు!




న్యూఢిల్లీ: మహిళా నేతలపై అనుచిత వ్యాఖ్యలతో వార్తల్లోకి ఎక్కిన బీజేపీ నేత రమేష్ బిదురిపై బీజేపీ అధిష్టానం గరంగరంగా ఉంది. ఆయనపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా.. ఆయన్ని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నుంచి తప్పించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ సీఎం అతిషితో పాటు ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాపై రమేష్ బిదురి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇవి రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. బీజేపీ నేత వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఇటు ఆప్, అటు కాంగ్రెస్‌లు దేశవ్యాప్త ఆందోళనకు దిగాయి. ఈ పరిణామాలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయన్ని ఎన్నికల నుంచి తప్పించడమో లేదంటే నియోజకవర్గాన్ని మార్చడమో చేయాలని ఆలోచిస్తున్నార ట. ఈ అంశంపై రెండుసార్లు భేటీ జరిగినట్లు సమాచారం. ఇక బీజేపీ ఈ మధ్యే తొలి జాబితా విడుదల చేయగా.. కల్కాజీ నుంచి సీఎం అతిషిపైనే రమేష్ బిదురిని బీజేపీకి పోటీకి దింపింది. ఈ క్రమంలోనే ఓ సభలో పాల్గొన్న ఆయన అతిషిపైనా అభ్యంతకర వ్యాఖ్యలు చేశారు. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయన్ని అభ్యర్థిగా కొనసాగించడం పార్టీకి మంచిది కాదని బీజేపీ భావిస్తోందట!. కల్కాజీ నియోజకవర్గంలో రమేష్ బిదురిని తప్పించి.. ఆ స్థానంలో మహిళా అభ్యర్థిని అతిషిపై నిలపాలని బీజేపీ అనుకుంటోంది. ఈ మేరకు రమేష్‌తోనూ అధిష్టానం చర్చలు జరుపుతున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి. గుజ్జర్ సామాజికవర్గపు బలమైన నేతగా పేరున్న రమేష్ బిదురి గతంలో.. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎంపీగా పని చేశారు.

ఇంతకీ ఆయన ఏమన్నారంటే..

రమేష్ బిదురి కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. తాను అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గితే.. నియోజకవర్గంలోని రోడ్లను ఢిల్లీలోని కల్కాజీ నుంచి తాను విజయం సాధిస్తే అన్ని రోడ్లను ప్రియాంక గాంధీ చెంపలలాగా నున్నగా చేస్తానంటూ వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. .. సీఎం ఆతీషి ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా.. ప్రస్తుతం మరో పేరును వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డ అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు" అంటూ రమేశ్ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.

# మహిళల శరీరంపై కామెంట్స్ చేస్తే అది లైంగిక వేధింపే

కొచ్చి, మహిళల శరీరం నిర్మాణంపై ఎటువంటి వ్యాఖ్యలు చేసినా.. అది లైంగిక వేధింపు అవుతుందని కేరళ హైకోర్టు పేర్కొన్నది. జస్టిస్ ఏ బదరుద్దీన్ ఈ తీర్పును ఇచ్చారు. కేరళ విద్యుత్తు శాఖకు చెందిన ఓ మహిళా ఉద్యోగినిపై మరో ఉద్యోగి కామెంట్ చేశారు. దీంతో ఆమె లైంగిక వేధింపుల కేసు నమోదు చేసింది. ఆ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆ ఉద్యోగి కోర్టును ఆశ్రయించాడు. 2013 నుంచి ఆ ఉద్యోగి చాలా అసభ్యకరమైన భాషను వాడారని, 2017లో అభ్యంతరకరమైన మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ చేసేవాడని ఆమె ఆరోపించింది. విద్యుత్తు శాఖకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. మహిళా ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐపీసీలోని సెక్షన్ 354ఏ(లైంగిక వేధింపులు), 509(మహిళను కించపరచడం), సెక్షన్120(ఓ) కింద కేసు బుక్ చేశారు. కేరళ పోలీసు చట్టంలోని సెక్షన్ 120(ఓ) కింద కూడా ఆ ఉద్యోగి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కోర్టు పేర్కొన్నది. అయితే కేవలం శరీర శౌష్టవం బాగుందని కామెంట్ చేసినంత మాత్రానా.. తనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారని, ఆకేసును కొట్టివేయాలని విద్యుత్తు శాఖ ఉద్యోగి కోర్టును ఆశ్రయించారు. కాల్స్, మెసేజ్‌లతో నిందిత వ్యక్తి లైంగిక వేధింపుల కామెంట్స్ చేసినట్లు మహిళా ఉద్యోగి ఆరోపించింది. అయితే ఐపీసీలోని సెక్షన్ 354ఏ, 509తో పాటు సెక్షన్ 120 కేరళ పోలీసు చట్టం ప్రకారం నిందితుడిపై తగిన ఆధారాలు ఉన్నట్లు హైకోర్టు తెలిపింది.




# గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్ గా మారడం ఖాయం..



విశాఖపట్నం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో 2047విజన్ సాకారం అవుతుందని, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్ గా మారుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ డీటీఐ(డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ), ఎస్టీపీఐ(సాఫ్ట్ వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్-2025 కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్ ను లాంఛనంగా ప్రారంభించారు. ఏడు రంగాల్లో ఐటీ అభివృద్ధి, డీప్ టెక్నాలజీ ప్రాముఖ్యత, స్టార్టప్ ల వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మట్లాడుతూ ఏపీలో సాంకేతిక అభివృద్ధికి దిశానిర్దేశం చేయనున్న ఈ సమ్మిట్ లో పాల్గొనడం చాలా గర్వంగా ఉందన్నారు. భవిష్యత్ లో ఏపీ గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ హబ్ గా మారుతుందన్నారు. ఇన్నోవేషన్, డీప్ టెక్ నైపుణ్యాన్ని పెంపొందించడం ద్వారా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి సాధ్యపడుతుందన్నారు. అభివృద్ధికి ఇన్నోవేషన్ చాలా ముఖ్యమన్నారు. ఏఐ, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్, ఎడ్యుటెక్, ఎనర్జీ స్మార్ట్ సొల్యూషన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ రోబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయన్నారు. సామాజిక సమస్యల పరిష్కారానికి ఐటీ, ఎలక్ట్రానిక్స్, మెడ్ టెక్, స్మార్ట్ టెక్నాలజీస్ కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్య రంగంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం ఏవిధమైన మార్పులు తీసుకువచ్చిందో మనం చూశామన్నారు.

ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం..

2047 నాటికి ఏపీని 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతామన్నారు. 2020 విజన్ భాగంగా చంద్రబాబునాయుడు ఐటీని అభివృద్ధి చేశారు. ఇప్పుడు విజన్ 2047లో భాగస్వామ్యం కావడం నా అదృష్టమన్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో 2047 కలను సాకారం చేస్తాం. ఉద్యోగాలు పొందేందుకు, కల్పించేందుకు ఇన్నోవేషన్ తో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువస్తామన్నారు. ఉన్నత విద్యను సంస్కరిస్తాం. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ లో ఏపీ ప్రస్తుతం 9వ స్థానంలో ఉంది. దీనిని 3వ స్థానానికి తీసుకువస్తామన్నారు. ఇందుకు పరిశ్రమ వర్గాలు తమవంతు సహకారం అందించాలి. విశాఖలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర సాంకేతిక విప్లవంలో ఏపీ డిజిటల్ టెక్నాలజీ సమ్మిట్ తనవంతు పాత్ర పోషించాలన్నారు. సంక్షోభాలనే అవకాశాలుగా మలచుకోవాలని మా నాయకుడు చెప్పారు. ఇది మన అవకాశమన్నారు.

అభివృద్ధిని వికేంద్రీకరిస్తాం..

ఏపీ అభివృద్ధికి ప్రధాని ఎంతో సహకరిస్తున్నారు. నేడు 2 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తామన్నారు. రాయలసీమలోని అనంతపూర్ కు కియా పరిశ్రమ రావడం ద్వారా తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉండి గోదావరి జిల్లాలతో పోటీపడుతోందన్నారు. కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ హబ్ గా రూపొందిస్తాం. చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ గా మారుస్తామన్నారు. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా మారుస్తాం. ఉత్తరాంధ్రకు త్వరలోనే ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ రాబోతోంది. విశాఖకు డేటా సెంటర్ తీసుకువస్తాం. త్వరలోనే టీసీఎస్ రాబోతోందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను నెలకొల్పుతాం. పారిశ్రామికవేత్తలకు అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ.. ఏపీలో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందన్నారు. సంక్షోభాలనే అవకాశాలుగా మల్చుకుందామన్నారు. ఈ ఐదేళ్లు చాలా కీలకమన్నారు. నూతన ఆవిష్కరణలకు సిద్ధంగా ఉన్నాం. విశాఖను ఐటీ హబ్ గా మార్చేందుకు అవసరమైన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. పరిశోధన రంగాన్ని కూడా మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎన్ఎఫ్ ఛైర్మన్ శ్రీధర్ కొసరాజుతో పాటు కేడీఈఎమ్ ఛైర్మన్ బీవీ నాయుడు, అలోన్ఓఎస్ కో-ఫౌండర్ సీపీ గుర్నాని, ఎస్టీపీఐ డైరెక్టర్ సి.కవిత, ఐటీఏపీ ప్రెసిడెంట్ లక్ష్మీ ముక్కవిల్లి, తదితరులు పాల్గొన్నారు.

# నీరుగారుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం



న్యూఢిల్లీ, ప్రజా పంపిణీ వ్యవస్థ లక్ష్యం నీరుగారింది. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా పేదరికం మాత్రం తగ్గడం లేదు. ఏటికేడు ఉచిత పథకాల రూపకల్పన దీనిని సూచిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరుతో జనం మోసపోతున్నారు. పేదరికం పెరగడంతో రక్తహీనత, తల్లీబిడ్డల మరణాలు పెరిగిపోయాయి. దీంతో జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం మందికి సబ్సిడీ ధాన్యం అందివ్వాలని కేంద్రం నిర్ణయించింది. కరోనా సమయంలో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద 2020 జనవరి 1నుండి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఇంత కాలంగా ఆహార ధాన్యాల సబ్సిడీ అందిస్తున్న పేదరికం, ఆకలి బాధలు తగ్గకపోగా పెరిగాయి. ప్రపంచ ఆకలి సూచికలో 156 దేశాల్లో మన దేశం 110వ స్థానంలో ఉంది. సార్వత్రిక ప్రజా పంపిణీ విధానం అమలు చేయడం దీనికి కీలక పరిష్కారం అని సూచనలు వస్తున్నా కేంద్రం పెడచెవిన పెడుతోంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ప్రభుత్వం తమ వ్యాపార, కంపెనీల ప్రయోజనాల కోసం ఆహార పంటల సాగును తగ్గించి, వాణిజ్య పంటలను బలవంతాన అమలు చేయించారు. చరిత్రలో ఎన్నడూ ఎరగని ఆకలి, కరువులతో కోట్ల మంది భారతీయులు చనిపోయారు. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం ఆహార పంటల అభివృద్ధికి కొన్ని చర్యలు చేపట్టినా, ప్రజల ఆకలి బాధలను తీర్చలేకపోయింది. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు 1960వ దశకంలో చైనా, పాకిస్తాన్‌లతో వచ్చిన యుద్దాలు ఆహారధాన్యాల సమస్యను మరింత తీవ్రం చేశాయి. తిండిగింజల కొరత పెరిగింది. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజా పంపిణీ వ్యవస్థ ఆవిర్భవించింది. 1964లో ఆహారధాన్యాల కమిటీని ఏర్పాటు చేసి ఒకవైపు ఆహారధాన్యాల ధరల పెరుగుదలను, అక్రమ నిల్వలను అరికట్టడం, మరోవైపు పేదలకు తక్కువ ధరకు ఆహారధాన్యాలు అందించడం ప్రారంభించారు. హరిత విప్లవం తర్వాత 1970-80 మధ్య గిరిజన ప్రాంత ప్రజలకు, క్రమంగా గ్రామ, పట్టణ పేదలకు విస్తరించారు. 1992 జూన్ నుండి పునరుద్ధరించబడిన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కరువు పీడిత ప్రాంతాలు, గిరిజన, ఎడారి ఉన్న 1775 ప్రాంతాల్లో ఈ పథకం ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించారు. 1977 నుండి లక్షిత ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీ ఆహార ధాన్యాలు అందించారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి కుటుంబానికి 20 కిలోల చొప్పున బియ్యం, పేదల్లో మరింత పేదరికంలో వున్న వారికి 2002 నుండి అంత్యోదయ అన్న యోజన పథకం ద్వారా కటుంబానికి 35 కిలోలు ఇచ్చారు. ఎన్.టి.రామరావు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన రేషన్ బియ్యం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ పథకాన్ని రద్దు చేయాలని ప్రయ త్నించిన కాంగ్రెసు తర్వాతి కాలంలో రూపాయికే కిలో బియ్యం హామీ ఇవ్వాల్సి వచ్చింది. చంద్రబాబు ఈ బియ్యం పథకాన్ని కుదించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. . వైసిపి పాలనలో ఇంటి వద్దకే బియ్యం అందించాల్సి వచ్చింది. ఇంత చేసినా రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 54 శాతం మందికి మాత్రమే రేషన్ బియ్యం అందుతుంది. 2020 జనాభా ఆధారంగా చూస్తే 50 శాతం మందికి మాత్రమే అందుతుంది. బియ్యంతో పాటు, చక్కెర, కందిపప్పు, ఆయిల్, కిరోసిన్ లాంటి సరుకులు ఇవ్వాల్సి వుండగా బియ్యం మాత్రమే పంపిణీ అవుతుంది. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ఉపాధితో జనం అల్లాడిపోతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెబుతున్న పాలకులు పేదలకు అవసరమైన కనీస నిత్యావసర సరుకులను మాత్రం ప్రజా పంపిణీ ద్వారా అందించడం లేదు. లక్షల టన్నుల ధాన్యం భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో మగ్గిపోతున్న పేదలకు ఎందుకు పంచడం లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా పాలకుల తీరు మారలేదు. కార్పొరేట్ కంపెనీలకు కోట్ల రాయితీలు ఇస్తున్న మోడీ ప్రభుత్వం రైతులను గట్టెక్కించే ప్రయత్నాలు చేయడం లేదు. దేశానికి సరిపడా తిండిగింజలు ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించడం లేదు. దేశ ఆహార భద్రతలో కీలకంగా వ్యవహరిస్తున్న ఎఫ్‌సిఐ గోడౌన్లను మూసివేయడం లేదా ప్రైవేటీకరించడం ఈ ప్రభుత్వ విధానంగా కనిపిస్తోంది. గత 13 సంవత్సరాలుగా జనాభా లెక్కలు సేకరించకుండా 2011 లెక్కల ఆధారంగానే ప్రస్తుత ప్రజా పంపిణీ అమలు చేస్తున్నారు. ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు అంటూ ఈ పథకాన్ని కుదించడానికి అనేక ప్రయత్నాలు కేంద్రం చేస్తోంది. 2013-14లో ఆహార సబ్సిడీ కోసం దేశ స్థూల జాతీయోత్పత్తిలో 0.8 శాతం ఖర్చు చేస్తుండగా, 2019-20లో 0.5 శాతానికి తగ్గించివేశారు. కరోనా సమయంలో అనివార్యంగా 2021-22లో 1.2 శాతానికి పెంచి ఆ తర్వాత 2023-24లో 0.7 శాతానికి తగ్గించివేశారు. ఎఫ్.సి.ఐ ద్వారా ఇస్తున్న సబ్సిడీకి 2021-22లో రూ.2,08,929 కోట్లు కేటాయించగా, 2023-24లో రూ. 1,37,207 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనివల్ల బియ్యం, గోధుమల సేకరణ తగ్గింది. 2015-16లో 342.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించగా, 2022-23లో 434.83 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇదే కాలంలో గోధుమల సేకరణ 57 శాతం తగ్గింది. ఇవన్నీ సమీక్షించి పక్కాగా పథకాలను అమలు చేయాల్సిన సమయం ఇది.

## విందుభోజనంలో విషం కలిపిన దుర్మార్గుడు

ముంబయి,వివాహ రిసెప్షన్‌లో ఓ వ్యక్తి దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనంలో విషం కలిపాడు. తన మేనకోడలు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడమే అందుకు కారణం. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని ఉట్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తన ఇంట్లోనే పెరిగిన మేనకోడలు మరో వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇటీవల మేనకోడలి పెళ్లి రిసెప్షన్‌కి వెళ్లిన అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన వంటకాల్లో విషం కలిపాడు. ఇది గమనించిన కొందరు అతడిని అడ్డుకున్నారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నిందితుడు పారిపోయాడు. ఆ ఆహార పదార్థాలను ఎవరూ తినకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

# రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం...



హైదరాబాద్,రాష్ట్రంలో రూ.2,600 కోట్లతో గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఆవాసం నుంచి గ్రామపంచాయతీ, అక్కడ నుంచి మండలానికి, జిల్లా కేంద్రానికి రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. సరైన రహదారి సౌకర్యాలు లేక పోవడమే పల్లెల వెనకబాటుకి కారణమని ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని చేపడుతోందని అన్నారు. ఎర్రమంజిలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయంలో రూరల్ ఇంజనీర్లతో మంత్రి సీతక్క బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ కనక రత్నం, చీఫ్ ఇంజనీర్లు, సీఈలు, ఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రోడ్ల నిర్వహణ కోసం రూ.1600 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా రూరల్ ఇంజనీర్లు కార్యాచరణ సిద్ధం చేయాలని, కొత్త రహదారుల నిర్మాణ అంచనాలు పక్కాగా ఉండాలని సూచించారు. ఇష్టా రీతినా అంచనాలను సవరించొద్దని తెలిపారు. 30 మెట్రిక్ టన్నుల వాహనాలు నడిచేలా రోడ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని అన్నారు. ఇంజనీర్లే ఈ దేశ నిర్మాతలని అన్న మంత్రి మోక్షగుండం విశ్వేశ్వరయ్య, కాకతీయుల కాలం నాడు కట్టిన కట్టడాలు ఇంకా పటిష్టంగా ఉన్నాయని గుర్తు చేశారు. అదే రీతిన గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజనీర్లు కట్టే నిర్మాణాలు 10 తరాలు ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. మహానగరాల్లో రోడ్లు మెరిసినట్టుగానే ప్లలెల్లో రహదారులు మెరవాలని, ఆ బాధ్యత గ్రామీణ విభాగానికి చెందిన ఇంజనీరింగ్ అధికారులదేనని అన్నారు. పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా రహదారుల నిర్మాణం జరగాలని అన్నారు. నాణ్యతపై రాజీ పడొద్దని, జిల్లా స్థాయిలో రూరల్ ఇంజనీర్లు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అన్నారు. పనుల పురోగతి నివేదికలను ప్రతి 15 రోజులకు నివేదించాలని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గుండివాగు బ్రిడ్జి 10 ఏండ్లుగా పూర్తికాలేదని, దీనివల్ల 40 మంది ప్రజలు వాగు దాటలేక మృత్యువాత పడ్డారని మంత్రి అన్నారు. గతంలో తన నియోజకవర్గంలో సరైన గ్రామీణ రోడ్లు లేక ఎంతో మంది ఆత్మీయులను రోడ్డు ప్రమాదంలో కోల్పోయానని చెప్పారు. పట్టణాల్లో లఓల్గ÷వర్లు, స్కై ఓవర్లు ఉన్నాయి, కానీ చాలా గ్రామాల్లో కనీస రోడ్డు సదుపాయం లేకపోవడం బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల ప్లలెలకు రహదారి సౌకర్యం కలిగిస్తేనే అసలైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఎస్టి వర్గానికి చెందిన తనకు పంచాయతీరాజ్ శాఖ అప్పగించారని అన్నారు. రూరల్ ఇంజనీర్లు సహకారం ఉంటే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. రోడ్డు సదుపాయం లేని ఆవాసాలు, గ్రామాలు ఉండొద్దని, ఆ లక్ష్యంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ భాగం పని చేయాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## వ్యాపార దృష్టితో చూడొద్దు...

హైదరాబాద్,ప్రైవేటు విద్యా సంస్థలు వ్యాపార దృష్టితో కాకుండా, భావి భారత పౌరులను తీర్చి దిద్దాలనే లక్ష్యంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తెలంగాణ రికాగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొన్న మంత్రి.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రైవేటు విద్యా సంస్థల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు సమాంతరంగా పనిచేసినపుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 60 శాతం విద్యార్థులు ప్రైవేటు సంస్థలల్లోనే చదువుతున్నారని, వ్యాపర దృష్టితో కాకుండా విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించేందుకు అందించేందుకు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com